క్లుప్తంగా

చదువులో పోటీతత్వం ఉండాలి



విద్యార్థులను అభినందిస్తున్న విజయ చైతన్య తదితరులు

గోపాలపట్నం: చదువులో పోటీ తత్వం ఉండాలని బెహరా విద్యాసంస్థల అధినేత బెహరా విజయ చైతన్య అన్నారు. ఇక్కడి నరవ బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి, రెండో సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శుక్రవారం అభినందించారు. అత్యధిక విద్యార్థులు 90, 91, 92, 95, 97 శాతం మార్కులు సాధించారని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ తరుణ్ కుమార్, ప్రిన్సిపాల్ సుకన్య, ఏవో శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డిపోల తనిఖీ



ఆర్‌కే పురం రేషన్ డిపో వద్ద వివరాలు సేకరిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు

మల్కాపురం: రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు శుక్రవారం పారిశ్రామిక ప్రాంతంలోని పలు రేషన్ డిపోలను తనిఖీ చేశారు. తొలుత ఆర్‌కేపురం,జైఆంధ్రకాలనీ ప్రాంతాల్లోని రేషన్ డిపోలకు వెళ్లారు.అవి తెరవక పోవడంతో ఆయా డీలర్లకు మెమోలు జారీ చేయాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. అనంతరం మల్కాపురం రేషన్ డిపోను తనిఖీ చేశారు. అక్కడ పంచదార నిల్వ అధికంగా ఉండడంతో డిపో డీలర్‌ను ప్రశ్నించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఎకో–వైజాగ్' చిత్రలేఖన పోటీలు



ఆర్పీ పేట హైస్కూల్‌లో చిత్రలేఖన పోటీలను పర్యవేక్షిస్తున్న హెచ్ఎం శ్రీనివాసరావు

కంచరపాలెం: 'ఎకో–వైజాగ్' పేరిట పాఠశాలల్లో శుక్రవారం జీవీఎంసీ చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జోన్ పరిధిలోని ఆర్పీ పేట, కప్పరాడ జీవీఎంసీ హైస్కూళ్లు, కంచరపాలెం, ఆర్పీ పేట, కె.కాలనీ, తిక్కవానిపాలెం, ధర్మానగర్, రాంజీ ఎస్టేట్, సుభాష్‌నగర్ ప్రాథమిక పాఠశాలల్లో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నో యూజ్ సింగల్ ప్లాస్టిక్, పర్యావరణం తదతర అంశాలపై వారు గీసిన చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పోటీలను ఆర్పీ పేట హైస్కూల్ హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, ఆర్ట్ ఇన్‌చార్జి ఎన్.ఎస్.శంకర్, సచివాలయం అడ్మిన్ అశోక్ పర్యవేక్షించారు.

నైపుణ్యాభివృద్ధి కోర్సులు సద్వినియోగం చేసుకోవాలి

మురళీనగర్: ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి కాలేజీల్లో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కోర్సులను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని టెక్నికల్ ఎడ్యుకేషన్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.వెంకటరమణ సూచించారు. విశాఖ పార్లమెంటరీ పరిధిలోని సెమ్స్‌లో ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధి కాలేజీని (స్కిల్ కాలేజీ) జిల్లా టెక్నికల్ ప్రతినిధులు శుక్రవారం సందర్శించారు. ఈ మేరకు కాలేజీలో అమలు చేస్తున్న కోర్సులు, వాటి అమలు తీరును పరిశీలించారు. సెమ్స్ సీఈవో కె.శేతుమాధవన్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ గోపీకృష్ణ శివ్వం, మార్కెటింగ్ మేనేజర్ లివింగ్‌స్టన్ ఫ్రాన్సిస్‌లతో స్కిల్ కోర్సులపై ఆయన చర్చించారు.

లబ్ధిదారులందరికీ జగనన్న సు'రక్ష'

- ప్రతి ఒక్కరూ సేవలు పొందండి
- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్



లబ్ధిదారుకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, జోన్–5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: అర్హులై పథకాలు అందకుండా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో మేలు చేస్తుందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 56వ వార్డు కంచరపాలెం జీవీఎంసీ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. వార్డులో ప్రజలకు ఏ సమస్య ఉన్నా.. తన దృష్టికి తీసురావాలని కోరారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 11 రకాల సేవలు, సంక్షేమ పథకాలకు అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా అందజేస్తున్నారని, లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆనంద్‌కుమార్ కోరారు.

603 ధ్రువపత్రాల అందజేత .. 56వ వార్డు పరిధిలోని 21086314 చాకలిగెడ్డ, 306 రామ్మూర్తి పంతులుపేట, 315 గవర కంచరపాలెం, 265 గొల్లకంచరపాలెం, 266 మళ్లసూరి వీధి సచివాలయాలకు సంబంధించి కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్ తదితర ధ్రువపత్రాల కోసం 618 టోకెన్లు రిజిస్టర్ చేయగా.. 603 సర్టిఫికెట్లను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, పార్టీ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీను, క్లస్టర్ కన్వీనర్ పల్ల ఎర్నికుమార్, మజ్జి, దాసరి శామ్యూల్, సాయిలత, పి.సురేష్, రమేష్ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

కుల, ఆదాయ ధ్రువపత్రాలు పొందా..



పిల్లల చదువు నిమిత్తం కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం ఎమ్మార్వో ఆఫీస్ చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా.. ఫలితం కనిపించేది కాదు. తద్వారా సంక్షేమ పథకాలకు దూరమయ్యాం. వలంటీర్ మా ఇంటికి వచ్చి పరిస్థితి తెలుసుకుని కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం నమోదు చేయించారు. జగనన్న సురక్ష క్యాంపులో వాటిని అందజేశారు. చాలా ఆనందంగా ఉంది.

– గుమ్మిడి పార్వతి, తోటవీధి

మూడు రోజుల్లోనే సర్టిఫికెట్లు అందాయి



ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే సరైన సర్టిఫికెట్లు ఉండాలి. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గత వారంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్ మా ఇంటికి వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు. సురక్ష క్యాంపులో మాకు ధ్రువపత్రాలు అందజేశారు. ఇటువంటి క్యాంపులు ఎంతో ఉపయోగకరం.

– జి.మల్లేశ్వరరావు, దుర్గానగర్

సీఎం జగన్ సార్‌కు కృతజ్ఞతలు



సరైన ధ్రువపత్రాలు పొందడంతో ఏళ్లుగా అందని ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇప్పుడు అందుతాయనే నమ్మకం కలిగింది. జగనన్న సురక్ష కార్యక్రమంలో వివరాలు నమోదు చేసుకుని వారం తిరగకుండానే నా చేతికి ధ్రువపత్రాలు అందించగానే ఎంతో సంతోషించాను. సీఎం వైఎస్ జగన్ సార్‌కు మా కృతజ్ఞతలు.

– కంబురి వంశీ, గొల్లకంచరపాలెం

సంక్షేమ సారథి సీఎం జగన్



62వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆనంద్‌కుమార్



ములగాడలో అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆనంద్‌కుమార్

సింధియా: రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ ఫలాలు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు పరిధి అచ్చెంనాయుడులోవలో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు తో కలిసి సుమారు రూ.13 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి చేపడుతున్న పనుల నాణ్యతలో రాజీ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ క్లస్టర్ కన్వీనర్ భోగవిల్లి నాగభూషణం, వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

58వ వార్డులో..

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సుమారు కోటి రూపాయిలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంధ్‌కుమార్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ములగాడ ప్రాంతంలోని గెడ్డల ఆధునికీకరణతో పాటు ఎదురవానిపాలెం,ములగాడ ప్రాంతాల్లోని శ్మశానవాటికలను అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్లు చుక్క వరలక్ష్మిరెడ్డి,తోణంగి వెంకటరమణియాదవ్, వార్డు పార్టీ అధ్యక్షుడు కృష్ణ,నాయకులు పెద్దాడ వెంకటరణ,ధర్మాల వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేట నుంచి పైడిమాంబ కాలనీకి వెళ్లే బీటీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.19.50 లక్షలతో నిర్వహించనున్న ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జోన్–5 ఇంజినీరింగ్ అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీను, డీఈ ఏడుకొండలు, ఏఈ ఉషారాణి, నాయకులు పల్లా ఎర్నికుమార్, మళ్ల శంకరరావు, మజ్జి, దాసరి శామ్యూల్, ఆడారి మధు, సురేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ



ఔషధ మొక్క నాటుతున్న కీర్తి పట్నాయక్

మల్కాపురం: మానవాళి మనుగడ సాగాలంటే ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలని శ్రీదేవి విజ్ఞాన పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు కుప్పిలి కీర్తి పట్నాయక్ అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం జింక్ కొండపై గల శివాలయం పరిసరాల్లో పలు ఔషధ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖ నగరం పచ్చదనంతో నిండుగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. తమ ట్రస్టు ఆధ్వర్యంలో నగరం నలుమూలల వందల సంఖ్యలో మొక్కలు నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సెక్రటరీ, జింక్ రిటైర్డ్ ఉద్యోగి పి.సత్యారావు, బి.రామకృష్ణ, ఆలయ సేవకురాలు లక్ష్మి, ఎన్ఎస్‌టీఎల్ ఆఫీసర్ జి.వి.చారి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన



సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లకు సూచనలిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సూచనల మేరకు శుక్రవారం 40వ వార్డు ఏకేసీ కాలనీ 1, 2 సచివాలయ పరిధిలోని కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 40, 61, 62, 63 వార్డుల క్లస్టర్ కన్వీనర్ భోగవిల్లి నాగభూషణం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ నెలాఖరు వరకు జగనన్న సురక్ష క్యాంప్‌లో 11 రకాల సేవల ద్వారా అవసరమైన సర్టిఫికెట్లను ప్రతి లబ్ధిదారుకు ఉచితంగా అందిస్తున్నారని చెప్పారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు వారి వారి క్లస్టర్ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను నమోదు చేసుకుని, వారికి టోకెన్ ఇస్తారన్నారు. వలంటీర్లు ఇచ్చిన టోకెన్ ప్రకారం ఈ నెల 19న చింతల్లోవలో జరగనున్న జగనన్న సురక్ష క్యాంపులో అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు. అర్హులందరికీ జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశాన్ని వివరించి, వారికి అవసరమయ్యే ధ్రువపత్రాలను తీసుకునేలా చర్యలు చేపట్టాలని సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు కార్పొరేటర్ నాగేశ్వరరావు సూచించారు.

61వ వార్డులో ఇంటింటా సర్వే

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం పరిధి పల్లివీధి,నగరాలవీధి తదితర ప్రాంతాల్లో వలంటీర్లు జగనన్న సురక్ష సర్వే నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి విద్యార్థులకు ఆదాయ,నివాస,కుల ధ్రువీకరణ పత్రాలు ఏమైనా కావాలా అని అడిగారు. పెద్ద వారు అయితే ఏ పథకానికి దరఖాస్తు చేయాలని అనే వివరాలు సేకరించారు.

నేడు 91, 92 వార్డుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మాట్లాడుతున్న గుణిశెట్టి శ్రీనివాసరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 91, 92 వార్డుల్లో శనివారం జరగనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ 91వ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శ్రీనుబాబునగర్‌లోని సచివాలయం(472)లో శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొంటారని చెప్పారు. 92వ వార్డు శ్రీనుబాబునగర్ వినాయక గుడి వద్ద నుంచి ఉదయం 7 గంటలకు, 91వ వార్డు జయప్రకాష్‌నగర్‌లో సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. సచివాలయ కార్యదర్శులు, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ, పైడిరాజురెడ్డి, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

వాల్తేరు రైల్వే డివిజన్‌లో భద్రత తనిఖీలు



సింహాచలం రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌లను తనిఖీ చేస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్

తాటిచెట్లపాలెం: గోపాలపట్నం, సింహాచలం రైల్వే స్టేషన్ల పరిధిలో శుక్రవారం డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి భద్రత తనిఖీలు చేపట్టారు. డివిజన్ పరిధిలో ప్రతీ సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలించి.. పూర్తిస్థాయి తనిఖీలు చేపట్టనున్నట్లు డీఆర్ఎం తెలిపారు. భద్రత ప్రమాణాలు, ప్రోటోకాల్స్‌పై సిబ్బందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్.నాయుడు(గణబాబు), సింహాచలం ఆటో యూనియన్ ప్రతినిధులు డీఆర్ఎంను కలిసి పలు సమస్యలను వివరించారు. సింహాచలం రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని, కొత్తపాలెం, నరవ ప్రాంతాలకు వెళ్లే రహదారి పనులను త్వరితగతిన పునఃప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు.


స్కూల్ ఎదుట ట్రాఫిక్ జామ్



స్కూల్ ఎదుట భారీగా నిలిచిన వాహనాలు

మల్కాపురం: ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం యారాడ పార్కు ఎదురుగా గల ఓ ప్రైవేట్ పాఠశాల వద్ద తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకుంటుంది. అయినా స్కూల్ యాజమాన్యం స్పందించక పోవడంతో వాహనదారులు,పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. శ్రీహరిపురానికి సమీపంలోని యారాడ పార్కు ఎదురుగా ప్రైవేటు స్కూల్ ఉంది. విద్యార్థులను తీసుకువచ్చే ఆటోలు,ద్విచక్ర వాహనాలు గేటుకు ఎదురుగా రోడ్డుపై నిలపడంతో ఉదయం 8 నుంచి 9 గంటల వరకూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకుంటుంది. సమస్యను పరిష్కరించాలని పలువురు స్కూల్ యాజమాన్యానికి,ట్రాఫిక్ అధికారులకు విన్నవించినా నేటికీ ఫలితం లేదు.ఇప్పటికైనా అధికారులు సమస్యపై స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

గొర్రెల పెంపకందారుల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఫెడరేషన్ చైర్మన్ ప్రకాష్ యాదవ్

ఏయూక్యాంపస్: గొర్రెలు, మేకలు పెంపకందారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఏపీ గొర్రెల పెంపకం దారుల అభివృద్ధి సహకార ఫెడరేషన్ చైర్మన్ జి.ప్రకాష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జీవాల పెంపకంలో శాస్త్రీయ యాజమాన్య మెళకువలు సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెంపకం దారులు తమ సమస్యలను వివరించారు. ప్రతీ మండలంలోని బంజరు భూములను పెంపకందారులకు కేటాయించాలని, 50 ఏళ్లు దాటిన గొర్రెల కాపరులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని, ప్రమాదంలో, పిడుగుపడి మరణించిన కాపర్లకు రూ.10 లక్షలు పరిహారం కల్పించాలని, వివిధ సందర్భంలో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పశుశంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డి.రామకృష్ణ, జిల్లా గొర్రెలు పెంపకం దారుల సహకార యూనియన్ లిమిటెడ్ అధ్యక్షుడు గంటా శ్రీరామ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసి రావు, ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాస రావు, పశ్చిమ గోదావరి జిల్లా చైర్మన్ ఎం.వి. కృష్ణారావు, తూర్పు గోదావరి జిల్లా చైర్మన్ డీవీవీ సత్యనారాయణ మూర్తి, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, సహాయ సంచాలకులు, పశువైద్యులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ బానిసత్వం

- సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు
- కుటుంబాలతో సహా గంగవరం పోర్టు కార్మికుల పాదయాత్ర



కుటుంబాలతో పాదయాత్ర చేస్తున్న కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో కార్మికులకు బానిసత్వం అమలవుతోందని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద గల స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద చేపట్టిన నిరవధిక నిరసన దీక్షా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కాస్తా ప్రధాని ప్రదేశ్‌గా మారిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు. కార్మికులకు వెంటనే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే విధుల నుంచి తొలగించిన వారిని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలన్నారు. అంతేకాకుండా 29 మంది కార్మికులపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు లోకనాథం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేఎం శ్రీనివాసరావు, ఎం.రాంబాబు, నమ్మి రమణ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్ తదితరులు మాట్లాడారు. దీక్షా శిబిరం నుంచి కొత్త గాజువాక, గాజువాక మెయిన్‌రోడ్డు, పాత గాజువాక జంక్షన్ వరకూ కార్మికులు కుటుంబ సభ్యులతో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, జెర్రిపోతుల ముత్యాలు, కొవిరి కోదండరావు, ఎం.రాంబాబు, పల్లేటి పోలయ్య, పితాని భాస్కర్, ఉమ్మిడి అప్పారావు, నొల్లి తాతారావు, వాసుపల్లి ఎల్లాజీ, గంటిపిల్లి అమ్మోరు, మాద అప్పారావు, కదిరి భూలోక రావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్యభామ యువ నృత్యోత్సవాలు

మద్దిలపాలెం: నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో అంతర్జాతీయ స్థాయిలో సత్యభామ యువ నృత్యోత్సవాలను శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్టు ఎన్ఎండీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిన విక్రమ్‌కుమార్ గౌడ్ తెలిపారు. దేశ, విదేశాలకు చెందిన నృత్య బృందాలు ఈ వేడుకల్లో పాల్గొంటున్నాయన్నారు. ఈ సందర్భంగా పురస్కారాలు అందిస్తామన్నారు.

విశిష్ట పురస్కారాల ప్రదానం

నాట్యరంగంలో నిష్ణాతులైన నాట్య కళాకారులకు 2023వ సంవత్సరానికి సత్యభామ పురస్కారాలు అందజేయనున్నారు. సిద్ధేంద్ర యోగి కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రికి పద్మశ్రీ శోభానాయుడు స్మారక ఎక్సలెన్స్ పురస్కారం, యునైటెడ్ అరబిక్‌కు చెందిన తెన్నేటి శ్రావణికి శోభానాయుడు యువ పురస్కారం, వేదాంతం లక్ష్మీనరసింహశాస్త్రికి యువ పురస్కారం, కూచిపూడికి చెందిన వేదాంతం వాగ్దేవి ప్రసాద్‌కు, చిత్ర సుకుమార్‌కు సత్యభామ పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. సూడగాని గీతా నారాయణ్‌కు సత్యభామ ఎక్సలెన్స్ అవార్డు, సత్యభామ బెస్ట్ టీచర్ అవార్డులను వి.వి.ఎస్.జగన్నాథరావు(కూచిపూడి), జి.మాయరాణి(మోహినీయాట్టం), ఎస్ఎస్‌వీ సత్యభామ(కూచిపూడి), బి.విజయ జ్యోతి పరమేష్(కూచిపూడి), ఎం.భారతి(భరతనాట్యం) స్వీకరించనున్నారని విక్రమ్ గౌడ్ తెలిపారు.